క్లుప్తంగా

వేసవి క్రీడా శిక్షణా శిబిరం

కల్లూరు: కల్లూరు మండల కేంద్రంలో ఉన్న మినీ స్టేడియంలో జిల్లా క్రీడాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో బాల, బాలికలకు మే ఒకటో తేదీ నుంచి నెలరోజుల పాటు ఉచితంగా వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాలీబాల్, బ్యాట్‌మెంటిన్, షటిల్, అథ్లెటిక్స్ కబడ్డీ క్రీడలకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు నంబర్ 9440669401ను సంప్రదించాలని వీరరాఘవయ్య కోరారు.

మిస్ట్‌లో వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హరికృష్ణ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 2, 3వ సంవత్సరం విద్యార్థులకు డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశాలపై సోమవారం వర్క్‌షాప్ ప్రారంభమైంది. మూడురోజుల పాటు ఈ వర్క్‌షాప్ నిర్వహించబడుతుందని ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డీన్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ కోఆర్డినేటర్ రామచంద్రరావు, మారేశ్వరరావు, రాజా జాకబ్ పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందిస్తున్న దృశ్యం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో రీజినల్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్ రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని వైరా మండలంలోని గొల్లపూడి గ్రామానికి చెందిన ఎంసీఏ విద్యార్థి చేపలమడుగు బెన్నికు లయన్స్ విద్యా ట్రస్ట్ ఆర్థిక సాయంతో ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, కోర్డినేటర్ ఉండ్రు శ్యాంబాబు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, జాలా మహాలక్ష్మి ఉన్నారు.

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు సభ

వైరా: వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ కళాశాల సీబీఎస్‌ఈ విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాడెంట్ డాక్టర్ పి.భూమేశ్వర రావు, డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీ కృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్‌లు మాట్లాడారు. అనంతరం కళాశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భువన ప్రసాద్, ఏఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

చింతకాని: మండల పరిధిలోని వందనం గ్రామ సమీపంలో ఇసుక లారీని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

కార్మిక హక్కుల సాధనకు ఉద్యమించాలి

వైరా: కార్మికుల హక్కులపై ఐక్యంగా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వై.బాబు అన్నారు. సోమవారం వైరాలోని విక్రమ్ భవన్‌లో ఆ సంఘం వైరా సబ్ డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలకు అవలంబిస్తుందన్నారు. మే 1న నిర్వహించే మేడేను ఘనంగా నిర్వహించాలన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎస్‌కే లాల్‌మియా, లక్ష్మణ్, సైదా, రాజు, మీరా, రసూల్, అజ్మత్, వినోద్, చక్రపాణి, జానీ పాల్గొన్నారు.

కలయిక వాకర్స్‌క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

మధిర: కలయిక వాకర్స్ క్లబ్ 2024–26 సంవత్సరానికి నూతనంగా ఏర్పడిన కమిటీ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షుడిగా వేమూరి సునీల్‌కుమార్, అధ్యక్షుడిగా ఇరుకుళ్ళ బాలకోటేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా పరాంకుశం శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా కాజా శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అప్పన లక్ష్మినారాయణ, కోఆర్డినేటర్‌గా చంద్ర కోటయ్య, స్పోక్ పర్సన్‌గా టీవీ రెడ్డి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా చావలి రామరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ గౌరవ అధ్యక్షులు వేమూరి సునీల్ కుమార్ చేతుల మీదగా క్లబ్ అధ్యక్షులతో పాటు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

బంగారు బాటకు 'భవిత'

- దివ్యాంగులకు అండగా కేంద్రాలు
- ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూత
- సత్ఫలితాలనిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ శిబిరాలు



వైరాలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

వైరా: సహకరించని శరీరం ఒకవైపు.. లోకజ్ఞానం తెలియని పసి హృదయం మరోవైపు.. ఆడిపాడే వయసులో ఆవేదన స్థితికి చేరిన చిన్నారులను 'భవిత' కేంద్రాలు భరోసానిస్తున్నాయి. ఇటు వైద్య చికిత్సతో పాటు విద్యాభ్యాసం చేయించి వారిలో చైతన్యం కల్పిస్తున్నాయి. ఫలితంగా వారి వైకల్యాన్ని దూరం చేయడంతో పాటు, చదువుపై దృష్టి పెట్టేలా ఇక్కడి ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. విద్యాహక్కు చట్టంలో భాగంగా తెలంగాణ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాలు దివ్యాంగుల్లో మార్పు తేవడమే గాక సత్ఫలితాలిస్తున్నాయి.

చిన్నారులను గుర్తిస్తున్న తీరు..

రాష్ట్ర సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో 21 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,196 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారు. అలాగే 356 మంది ఎటూ కదలలేక.. ఇంటి వద్దనే విద్య అందుకునే వారు ఉన్నట్లు విద్యాశాఖ సర్వేలో గుర్తించింది. భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల (మానసిక, శారీరక, వినికిడీ)కు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రతి కేంద్రంలో ఇద్దరు శిక్షకులు ఉన్నారు. ప్రతి మండలంలో సర్వే చేసి దివ్యాంగులైన పిల్లలను గుర్తించడం, పాఠశాలకు వెళ్లే పిల్లలను స్కూళ్లలో చేర్పించడం, పాఠశాలలకు వెళ్లలేని చిన్నారులకు భవిత సెంటర్‌లో ప్రవేశం కల్పించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ఆశాజనకంగా ఫలితాలు..

ఫిజియోథెరపీ (వ్యాయామం)శిబిరానికి వస్తున్న చిన్నారులు మంచి ఫలితాలు పొందుతున్నారు. కాళ్లు చచ్చుబడి మంచానికే పరిమితమనుకున్న వారు అడుగులు వేస్తున్నారు. చేతులు చచ్చుబడిన వారు ఇప్పుడు తమకు అందిన వస్తువులను పట్టుకోగలుగుతున్నారు. శిబిరంలో ఇచ్చిన సూచనలకు



మానసిక దివ్యాంగురాలికి చికిత్సచేస్తున్న దృశ్యం



ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధిస్తున్న దృశ్యం

అనుగుణంగా ఇంటి వద్ద కూడా కొంత సమయం వ్యాయామం చేయిస్తుండటంతో మానసిక దివ్యాంగుల్లోనూ మెరుగైన ఫలితాలు వస్తున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.

ప్రత్యేక సౌకర్యాలు..

భవిత సెంటర్‌లో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ప్రతి సోమ, మంగళ, బుధవారం భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చికిత్స 0–15 ఏళ్లలోపు పిల్లలు (శారీరక, మానసిక, కేంద్ర నాడీ వ్యవస్థ లోపం) గల వారికి ఫిజియోథెరపిస్ట్ ఆధ్వర్యంలో చికిత్స చేయిస్తున్నారు. వైకల్యంతో బాధపడుతూ మంచంపై నుంచి లేవలేని వారికి ప్రతి శనివారం ఇంటి వద్ద విద్య (హోమ్ టిస్ట్) అందిస్తూ వారి తల్లిదండ్రులకు పిల్లల వైకల్యం నుంచి బటయపడే విధంగా సూచనలు ఇస్తున్నారు. తల్లిదండ్రులు, సహాయకులతో పాఠశాలకు వెళ్లే దివ్యాంగుల పిల్లలకు పారితోషకం కింద ఒక్కొక్కరికి రూ.350 చొప్పున ప్రతి నెల వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ప్రతి కేంద్రంలోని దివ్యాంగుల పిల్లలకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాలు వీల్ చైర్స్, ట్రైసైకిల్స్, హియరింగ్ హెడ్స్, కోలేటర్స్, కాలిపర్స్, ఆర్టిఫీషియల్ లింబ్స్, బ్రెయిలీ కిట్స్ అందిస్తున్నారు.

మార్పులు వస్తున్నాయి..



మానసిక, శారీరక దివ్యాంగులకు విద్యతో పాటుగా శారీరకంగా శిక్షణ ఇస్తూ విద్యా బుద్ధులు నేర్పుతున్నాము. ఏడాదిగా 10 మంది నుంచి 15 మంది పిల్లలకు ఫిజియోథెరపీ చికిత్స చేయిస్తున్నాం. మొదట్లో అసలు లేవలేనివారు క్రమంగా పైకి లేవగలుగుతున్నారు.

– టి.అజిత, ఐఈఆర్టీ, వైరా

పాపకు నయమవుతోంది..



మా పాప పుట్టినప్పటి నుంచి ఏ వస్తువునూ పట్టుకునేది కాదు. ఫిజియోథెరపీ చేయిస్తున్నప్పటి నుంచి చేతికి ఇచ్చిన వస్తువులను పట్టుకోగలుగుతోంది. మరికొంత కాలం చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందని ఆశిస్తున్నాం. పాఠశాలకు పంపించడం వలన ఎంతో మార్పు వచ్చింది.

– ఇందిర, వైరా

వారి సంతోషమే లక్ష్యం..



వ్యాయామ చికిత్సతో వికలాంగుల్లో సాధ్యమైనంత వరకు మార్పు తీసుకురావడమే లక్ష్యం పనిచేస్తున్నాం.చిన్నారులకు అవయవాలు చక్కగా పనిచేసి, వారి ఇబ్బందులు తొలగి, తల్లిదండ్రులు సంతోషంగా ఉంటేనే మాకు తృప్తిగా ఉంటుంది.

– టి.రవి, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు, వైరా

క్రైస్తవుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కట్టుబడి ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంఆర్ గార్డెన్స్‌లో సోమవారం ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ ఆధ్వర్యాన జరిగిన క్రిస్టియన్ మైనార్టీ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించినట్లుగానే.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ అండగా నిలిచి ఆశీర్వదించాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దీపక్‌జాన్ మాట్లాడుతూ.. క్రైస్తవుల సంక్షేమానికి గత పదేళ్లలో జరిగింది శూన్యమని, సెక్యూలర్ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో క్రైస్తవుల సంక్షేమానికి ప్రణాళికలు సిద్ధం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ రాష్ట్ర చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, తోట సుజలరాణి, బేబి స్వర్ణకుమారి, ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌పాల్, టీసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ సుదర్శనం, బ్రెటీబ్యూలా, ప్రశాంత్‌కుమార్, సిల్వియజయదీప్, పింగళి సామేలు, గుండు సామేలు, ఏసుదాసు, ఎం.బాలస్వామి, సత్యానందం, నిరీక్షణరావు, బేతంపూడి వరప్రసాద్, పి.రవికిరణ్, జేమ్స్, దైవప్రసాద్, జాన్‌మార్క్, దేవ సహాయం, యాకోబ్‌లతో పాటు సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల వ్యాప్తంగా సుమారు వెయ్యిమంది పాస్టర్లు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించండి

పెనుబల్లి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకురాలు పొంగులేటి శ్రీలక్ష్మిలు కోరారు. పెనుబల్లి మండలంలోని మండాలపాడు, అడవిమల్లేల , సూరయ్యబంజర్, సూరయ్యబంజర్ తండా, కోండ్రుపాడు, పాత కారాయిగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే రాగమయి కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి ఆయా గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే ఐదు గ్యారెంటీలను అమలుచేసిందని, ఆగస్ట్ 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ కూడా చేయనున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, సోమరాజు సీతారామారావు, చీకటి రామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, బుక్కా కృష్ణవేణి, రాజబోయిన కోటేశ్వరరావు, పిల్లి నవజీవన్, పంది వెంకటేశ్వరరావు, వేముల కృష్ణయ్య, తెళ్ళ ఆనందరావు, గుగులోతు సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ సోమ్లానాయక్ తండాలోని 70 కుటుంబాలకు చెందిన 100 మందికి పైగా సోమవారం జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకుడు దయానంద్ విజయ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సోమరాజు సీతారామారావు, వంగా దామోదర్, వంగా వెంకటేశ్వర్లు, వంగా విజయకుమారి, గోగినేని రమేష్, మిట్టపల్లి కిరణ్‌కుమార్, బానోతు కృష్ణ, పంది వెంకటేశ్వరరావు, మాలోతు రాధాకృష్ణ, కాకా వెంకటేశ్వర్లు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కవి కాళ్లకూరి సేవలు మరువలేనివి

మధిర: మహాకవి కాళ్లకూరి నారాయణరావు సేవలు మరువలేనివని జిల్లా పద్య నాటక కళాకారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. నారాయణరావు 153వ జయంతిని సోమవారం మధిరలో నిర్వహించగా పలువురు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు.. కాళ్లకూరి నాటక రచనలపై విశ్లేషించారు. రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, రామ భక్త సీతయ్య కళాపరిషత్ నిర్వాహకులు బాబ్లా, కళాపరిషత్ ఖమ్మం అధ్యక్షులు కొండపల్లి జగన్మోహన్‌రావుతో పాటు మాధవరపు నాగేశ్వరరావు,ఇనపనూరి వసంత్, రమణ, రాజేంద్ర, దొండపాడు పాపారావు, చందాల కేశవదాస్ రంగాచారి, గాబ్రియల్, రాజారావు, సురభి, కొండలరావు పాల్గొన్నారు. అనంతరం బాబ్లా, గాబ్రియల్‌ను సన్మానించారు.

క్రైస్తవులంతా ఐక్యంగా ఉండాలి

కల్లూరు: తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవ సోదరులందరు ఐకమత్యంగా ఉండాలని తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ పేర్కొన్నారు. సోమవారం ఎస్ ఎస్‌పీలో బేతస్తా ప్రార్థన మందిరంలో నిర్వహించిన ఏబీసీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రైస్తవల సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను ఏబీసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎనోష్‌కుమార్, ప్రేయర్‌సెల్ జిల్లా అధ్యక్షుడు నిర్మల్‌కుమార్‌లు మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిషప్ ప్రియానార్డ్, పాస్టర్ రమేష్, మిడియాసెల్ అధ్యక్షులు దాసరి దేవిడ్‌రాజు, మండల అధ్యక్షుడు ఎబినేజర్, జాన్‌పరంజ్యోతి, సుందర్‌రాజు, తల్లాడ మండల అధద్యక్షులు కెనడి రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన అంకమ్మ జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, పొంగులేటి శ్రీలక్ష్మి

వేంసూరు: మండల పరిధిలోని వెంకటపురంలో నిర్వహిస్తున్న అంకమ్మ తిరునాళ్ల వేడుకలు సోమవారం ముగిశాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి సతీమణి శ్రీలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ఎండీ ఫైజుద్దీన్, మాజీ ఎంపీపీ రంగరాజు, గొర్ల వెంకటప్పరెడ్డి, కందిమళ్ళ వెంకటేశ్వరరావు, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పుచ్చాకాయల చెన్నారెడ్డి, లంకా నాగేంద్ర, వెంకటరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

అన్నారుగూడెం గ్రామంలో..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో నిర్వహించిన అంకమ్మ జాతర ఆదివారం రాత్రి ముగిసింది. ఐదు రోజులపాటు జాతర వైభవంగా జరిగింది. అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మలకు ప్రత్యేక పూజల అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కొలతల ప్రకారం పనిచేయాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఈజీఎస్ ఏపీడీ వెంకటపతిరాజు

కల్లూరురూరల్: ఉపాధిహామీ పథకంలో నిర్దేశిత కొలతల ప్రకారం పని చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని ఈజీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటపతి రాజు పేర్కొన్నారు. కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామ పంచాయతీ పరిధిలో చెల్లంపల్లి చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వేసవిలో పని కల్పించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ పథకంలో పనులు చేసి ఉపాధి పొందాలన్నారు. అందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఉపాధి పనులు చేపట్టాలని వెంకటపతిరాజు సూచించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో కూలీల హాజరు పట్టికలను ఆయన పరిశీలించారు.

పేరువంచ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు..

పేరువంచ పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ రామిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలు ఏపీడీ వెంకటపతిరాజుకు ఫిర్యాదు చేశారు. మస్టర్ వేయకుండానే పనులు చేయిస్తున్నాడని, ఈ విధంగా వారం రోజుల వరకు మస్టర్ వేయటం లేదని కూలీలు ఆరోపించారు. ఒక చెరువులో చేయించాల్సిన పనిని మరో చెరువులో చేస్తున్నాడని ఏది అడిగినా సరైన సమాధానం చెప్పటం లేదని కూలీలు వెలిశాల కృష్ణయ్య, మట్టెల నందిని, గుమ్మ చిన్న కృష్ణయ్య, కొనకళ్ల తిరుపతిరావు, గుమ్మ మహాలక్ష్మి, కోట్టావుల మురళీకృష్ణ, అంకాలు ఫిర్యాదు. కార్యక్రమంలో కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని, ఏఈ పుల్లారావు పాల్గొన్నారు.

నామ గెలుపునకు కృషి చేయాలి



పెనుబల్లి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, పక్కన నాయకులు

కారేపల్లి/పెనుబల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, ఆర్‌జేసీ కృష్ణ తెలిపారు. సోమవారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నామను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. అదే విధంగా పెనుబల్లి మండలంలోని రామచందర్‌రావుబంజర్ బీఆర్ఎస్ నాయకుడు ఎలమర్తి శ్రీను నివాసంలో నిర్వహించిన మండల నాయకులు సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ప్రజలకు వివరించాలని, కేసీఆర్ నాయకత్వంలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టిన బీజేపీ ప్రభుత్వం, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలతో దేశానికి ఒరిగింది ఏమీలేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగన్, మాజీ జెడ్పీటీసీ వీరేందర్, రమేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవీందర్, శ్రీనివాసరావు, బన్సిలాల్, లక్ష్మణ్, ఎంపీటీసీలు వసంత, శంకర్, గౌసుద్దీన్, మురళీ, రామారావు, అప్పారావు, హరీష్, వికాస్, రాజేష్, సక్రు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, భుక్యా ప్రసాద్, చెక్కిలాల లక్ష్మణరావు, ఎస్‌కె గౌస్, మందడపు అశోక్‌కుమార్, వంగా గిరిజాపతిరావు, తేజావత్ తావు నాయక్, కనగాల సురేష్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి ఎమ్మార్పీఎస్ మద్దతు

మధిర: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడిన బీజేపీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ తెలిపారు. సోమవారం మధిరలో ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు గెలుపు కోసం ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట హనుమంతరావు మాదిగ, రాయబారపు దాస్ మాదిగ, కొమ్ము జాన్ రాజ్ మాదిగ, ఏనూక మాదిగ, బలవంతపు నరసింహారావు మాదిగ, మంద అశోక్ మాదిగ, మేకల వరయ్య మాదిగ, కొండూరి రాజేష్ మాదిగ, రాజారత్నం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌రావును గెలిపించాలి..

ఎర్రుపాలెం: మండలంలోని తెల్లపాలెం, ఎర్రుపాలెం గ్రామాల్లో సోమవారం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని కోరుతూ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నూతక్కి నర్సింహారావు, నాయకులు దేవరకొండ కోటేశ్వరరావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ బీజేపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.

బీజేపీ నాయకుల ర్యాలీ..

ఏన్కూరు: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఏన్కూరు చేరుకొని అక్కడనుంచి కొత్తగూడెంలో జరిగే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభకు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొవ్వూరు నాగేశ్వరరావు, రమేష్, వెంకటేశ్వర్లు, రాందాస్, నరేష్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



నాచారం జట్టుకు ప్రథమ బహుమతి అందజేస్తున్న సంపత్

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం అంకమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన రెండు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మూడు రోజులపాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని ఏన్కూరు మండలం గంగుల నాచారం జట్టు కై వసం చేసుకుంది. ఆ తర్వాత స్థానాల్లో కల్లూరు, కోమట్లగూడెం, అన్నారుగూడెం, కల్లూరు టీంలు ద్వితీయ, తృతీయ, నాలుగో బహుమతి గెలుచుకున్నాయి. విజేతలకు కొమరవెల్లి మల్లన్న స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్ బహుమతులు అందించారు. అంతకుముందు క్రీడాకారులను ఖమ్మం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరావు, చిన్న శ్రీనివాసరావు, సాందీపులు, నున్నా తిరుమల్ రావు, కొమ్మినేని శ్రీనివాసరావు, మారెళ్ల దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేసవి నృత్య శిక్షణ శిబిరం ప్రారంభం

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని నవ్య మౌనిక డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి నృత్య శిక్షణ శిబిరాన్ని సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని, చిన్నప్పటి నుంచే నైతిక విలువలను అలవాటు చేయడంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమైందన్నారు. అదేవిధంగా స్టెప్‌అప్ డ్యాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్య శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణ పొందిన విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందించటం జరుగుతుందని డ్యాన్స్ మాస్టర్ కిన్నెర మణి తెలిపారు. మే 1వ తేదీ నుంచి చైతన్య టెక్నోస్కూల్, వాణి టెక్నోస్కూల్ లలో ఈ తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు.

బీటెక్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీకల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) హైద్రాబాద్ బీటెక్ మూడో సంవత్సరం ఫైనల్ పరీక్ష ఫలితాల్లో సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ ఊటుకూరు శేషారత్నకుమారి తెలిపారు. ట్రిపుల్‌ఈ విభాగంలో వి.అనూష, ఎస్.మహతి, ఎం.హేమామాలిని ప్రతిభ చూపారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో డి.మోక్షిత్, కె.చంద్రిక, గార్లపాటి శివాని, సిహెచ్ కావ్య, కె.హేమంత్, పి.అభినయ ప్రతిభ చూపారు. సీఎస్ఎన్ విభాగంలో కె.నవ్య, వి.గాయత్రి, ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరిని హెటిరో అధినేత, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి, ట్రస్టీ బండి అన్విదలు వర్చువల్‌గా అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

ఎనిమిదేళ్లకు కూతురి దరిచేరిన తల్లి



తల్లి రాములమ్మను కూతురికి అప్పగిస్తున్న పోలీసులు

సిరిసిల్ల: ఎనిమిదేళ్ల కిందట తప్పిపోయిన తల్లి.. ఆమె కోసం వెతికి వెతికి ఆశలు చాలించుకున్న కూతురు.. చివరికి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట పోలీసుల చొరవతో తల్లీబిడ్డలు కలిశారు. ఇల్లంతకుంట ఎస్సై రాజు కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలో గుర్తుతెలియని మహిళ ఉందని ఇల్లంతకుంట పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై రాజు బ్లూకోర్ట్ సిబ్బందిని పంపించి విచారించగా.. తన పేరు దోమల రాములమ్మ, భర్త పుల్లయ్య అని తెలిపింది. ఆమెను సిరిసిల్లలోని సఖి సెంటర్‌కు పంపించారు. ఆమె చెప్పిన వివరాల ఆధారంగా ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కిష్టాపూర్ గ్రామమని గుర్తించి ముదిగొండ పోలీసుల సహకారంతో ఆ గ్రామ పెద్దలకు రాములమ్మ ఫొటోలు పంపించారు. దీంతో ఆమెను తన తల్లిగా గుర్తించిన కూతురు రమాదేవి ఎనిమిదేళ్ల క్రితం మతిస్థిమితం సరిగా లేక తప్పిపోయిందని, అప్పటి నుంచి వెతుకుతున్నామని చెప్పింది. ఈమేరకు రమాదేవి సిరిసిల్ల చేరుకోగా.. ఇల్లంతకుంట ఎస్సై రాజు సమక్షాన ఆమె తల్లి రాములమ్మను అప్పగించారు. ఏళ్ల క్రితం తప్పిపోయిన తన తల్లిని అప్పగించడంపై పోలీసులు, సఖి కేంద్రం నిర్వాహకులకు రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు.